క్లుప్తంగా

పనిభారం తగ్గించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

సంజామల: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి వివిధ రకాల సర్వేలతో పని ఒత్తిడి ఎక్కువైందని పంచాయతీ కార్యదర్శులు అన్నారు. పనిభారం తగ్గించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీఓ సాల్మన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. ప్రభుత్వం 15 రకాల సర్వేలు చేయిస్తోందని తెలిపారు. ఒత్తిడి కారణంగా సెలవు రోజుల్లో కూడా సంతోషంగా గడపలేని పరిస్థితి నెలకొందన్నారు. పంచాయతీ కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, విష్ణు, లక్ష్మయ్య, చెన్నయ్య, లక్ష్మన్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బోరెడ్డి శ్రీరామిరెడ్డికి నివాళులు



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

ప్యాపిలి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్యాపిలి జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డికి పలువురు నివాళులర్పించారు. హైదరాబాద్ నుంచి మంగళవారం ఉదయం శ్రీరామిరెడ్డి భౌతికకాయాన్ని ప్యాపిలికి తీసుకొచ్చారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ప్యాపిలి, డోన్ ఎంపీపీలు గోకుల్ లక్ష్మి, రాజశేఖర్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోరెడ్డి పుల్లారెడ్డి, మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, గడ్డం భువనేశ్వర్ రెడ్డి, రాజా మురళీకృష్ణ, బోరెడ్డి రాము, డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తదితరులు నివాళులర్పించి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. సాయంత్రం అంత్యక్రియలు ముగిశాయి.

స్త్రీనిధి రుణాల రికవరీపై సమీక్ష



మాట్లాడుతున్న స్త్రీనిధి జిల్లా అసిస్టెంట్ మేనేజర్

బనగానపల్లె: స్త్రీనిధి పథకం కింద తీసుకున్న రుణాలను సక్రమంగా వసూలు చేయాలని ఆ పథకం జిల్లా అసిస్టెంట్ మేనేజర్ నాగప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో స్త్రీనిధి రుణాలు, రికవరీపై సమీక్షించారు. మండలంలో స్త్రీనిధి రుణ బకాయిలను సీసీలు డ్వాక్రా సంఘాల మహిళల నుంచి ఈ నెలాఖరులోగా రికవరీ చేయాలని తెలిపారు. తద్వారా మరింత మంది మహిళా సభ్యులకు రుణాలు ఇచ్చే అవకాశం ఉందన్నారు. గ్రామాల వారీగా స్త్రీనిధి బకాయిలపై చర్చించారు. ఏపీఎం అడ్డాకుల శ్రీనివాసులు, గ్రామైక్య సంఘాల లీడర్లు, వీఓలు పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు గడువు పొడిగింపు

బనగానపల్లె రూరల్: ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి దరఖాస్తు గడువును ఈ నెల 31వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం పొడిగించినట్లు బనగానపల్లె అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శోభారాణి మంగళవారం తెలిపారు. ఈ స్కీమ్ కింద పది, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ చదివిన 21–24 ఏళ్ల వయసు నిరుద్యోగులకు దేశంలోని టాప్ 500 కంపెనీల్లో ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ కల్పిస్తారని చెప్పారు. నెలకు రూ.5 వేల స్టైఫండ్, వన్‌టైం గ్రాంట్ కింద రూ.6 వేలు ఇస్తారని తెలిపారు. కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.8 లక్షల లోపు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు www.pminternship.mca.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్లలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్‌కానిస్టేబుల్ నాగన్న తెలిపిన వివరాల మేరకు.. ముక్కమల్ల గ్రామానికి చెందిన కుమ్మరి ఆంజనేయ ప్రసాద్ (45) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఇంటికి వచ్చి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. మృతినికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం

సంజామల: మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా విష్ణువర్ధన్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా బి.లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా రమేష్, బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణుడు, కోశాధికారిగా నాగలక్ష్మి, సంయుక్త కార్యదర్శిగా సురేష్, గౌరవ సలహాదారుడిగా సుధాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా వెంకట నారాయణ, సురేష్ బాబు, భారతిలను ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

ఎండు తెగులు..

రైతన్న కుదేలు

- మొక్కజొన్నకు తెగులు దెబ్బ
- పెరిగిన పెట్టుబడులు.. తగ్గిన దిగుబడులు
- రబీలోనూ అదే పరిస్థితి
- ముమ్మరంగా కోత, నూర్పిడి పనులు
- కొనుగోలు కేంద్రాలు లేక నష్టపోతున్న అన్నదాతలు



అమడాల వద్ద ఆరబోసిన మొక్కజొన్న దిగుబడులు

కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో మొక్కజొన్న సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం(హెక్టార్లలో)
అవుకు	1063
సంజామల	404
కొలిమిగుండ్ల	138
ఉయ్యాలవాడ	117
దొర్నిపాడు	30
కోవెలకుంట్ల	22

కోవెలకుంట్ల: ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలతో నట్టేట మునిగిన మొక్కజొన్న రైతులకు రబీ సీజన్ కూడా కలిసి రాకపోవడంతో నష్టాల ఊబిలో కూరుకుపోయారు. పంటమార్పిడి విధానం అవలంభించకుండా ఏటా మొక్కజొన్న పంటనే సాగు చేయడంతో తెగుళ్లు వెంటాడి దిగుబడులపై ప్రభావం చూపాయి. రబీ సీజన్‌లో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని అవుకు, సంజామల, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల, దొర్నిపాడు మండలాల్లో మొత్తం 1774 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగు చేశారు. 120 రోజుల పంట కాలం కలిగిన ఈ పంట చేతికందడంతో ఆయా మండలాల్లో ప్రస్తుతం కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

కన్నీటి దిగుబడులు

వ్యవసాయ సబ్ డివిజన్‌లో గత ఖరీఫ్ సీజన్‌లో విస్తారంగా మొక్కజొన్న పంట సాగు చేశారు. పంట కంకి దశలో ఉండగా గత ఏడాది అక్టోబర్ నెలలో తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో పంట దెబ్బతిని దిగుబడులు తగ్గాయి. పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 30 వేలకు పైగా వెచ్చించినా ఎకరాకు 22 నుంచి 30 క్వింటాళ్లలోపే దిగుబడులు వచ్చాయి. మార్కెట్‌లో గిట్టుబాటు ధర అంతంత మాత్రంగానే ఉండి ఆ ధరకే విక్రయించి నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ఈ నష్టాన్ని పూడ్చుకోవచ్చని కోటి ఆశలు పెట్టుకుని రబీలో తిరిగి మొక్కజొన్న పంట సాగు చేశారు. సబ్ డివిజన్‌లోని ఆరు మండలాల పరిధిలో 929 హెక్టార్లు సాధారణ విస్తీర్ణంగా కాగా 1,774 హెక్టార్లలో సాగు చేశారు. విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 40 వేలు వెచ్చించారు. పైరు నెల రోజుల దశలో ఉండగా విల్ట్(ఎండు తెగులు) వైరస్ సోకి మొక్కలు ఎండిపోయి చనిపోయాయి. ఎండు తెగులు బారినుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. వైరస్ సోకని పైరులో ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తున్నా తెగులు ఆశించిన పైరులో ఎకరాకు 18 నుంచి 22 క్వింటాళ్లకు మించి దిగుబడులు రావడం లేదని రైతులు వాపోతున్నారు. కోత, నూర్పిడికి ఎకరాకు రూ. 2వేలకు పైగా అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా రూ. 2,200 ధర పలుకుతోందని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా రూ. 3 వేల చొప్పున విక్రయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నాలుగు ఎకరాల్లో సాగు చేశాను



ఈ ఏడాది రబీ సీజన్‌లో 4 ఎకరాల సొంత పొలంలో మొక్కజొన్న పంట సాగు చేశాను. విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 40 వేలు వెచ్చించాను. ఎండు తెగులు ఆశించిన పైరులో దిగుబడులు తగ్గాయి. వైరస్ ప్రభావంలోని పైరులో ఎకరాకు 30 క్వింటాళ్లకు పైగా దిగుబడులు వచ్చాయి. క్వింటా రూ. 2,250 ప్రకారం దిగుబడులు విక్రయించాను.

–మహేశ్వరరెడ్డి, రైతు, అమడాల, కోవెలకుంట్ల

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పైరు చేతికందే తరుణంలో తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసి మొక్కజొన్నలో దిగుబడులు తగ్గాయి. రబీ సీజన్‌లో 2 ఎకరాల సొంత పొలంలో పంట సాగు చేయగా ప్రస్తుతం కోత దశలో ఉంది. మార్కెట్‌లో మద్దతు ధర అంతంత మాత్రంగానే పలుకుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంట ఉత్పత్తులను కొని రైతులను ఆదుకోవాలి.

– ఖాసీంబాషా, రైతు, ఆకుమల్ల, సంజామల

గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణపై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజల నుంచి తడి చెత్త– పొడి చెత్త వేరు చేసి సేకరించి, వాటి ద్వారా సంపదను ఏ విధంగా సృష్టించాలనే అంశంపై అవగాహన కల్పించారు. అందరి భాగస్వామ్యంతోనే గ్రామాలను పరిశుభ్రంగా ఉంచవచ్చన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే మన పరిసరాలు, వీధులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సర్పంచ్ లక్ష్మీదేవి, ఈఓఆర్డీ మల్లికార్జున పాల్గొన్నారు.



తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, ఈఓఆర్డీ

రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు జాబితా



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి నిరంజన్

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీలో రైతులు సాగుచేసిన పంటల నమోదు వివరాలను మండలంలోని ఆయా రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించామని.. రైతులు పరిశీలించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నకొప్పెర్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు ఏఓ మాట్లాడుతూ.. ఆయా రైతు సేవా కేంద్రాల్లో ఈపంట వివరాలను నోటీసు బోర్డులో ఉంచామని చెప్పారు. రైతులు సాగు చేసిన పంట వివరాలు అందులో ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని పేర్కొన్నారు. ఏవైనా మార్పులు ఉంటే ఆర్‌ఎస్‌కే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. అలాగే మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఇంకా 2,600 మంది పీఎం కిసాన్ లబ్ధిదారులు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయించుకోలేదన్నారు. వెంటనే రైతు సేవా కేంద్రాల్లో రిజిస్టర్ చేయించుకోవాలని తెలిపారు. లేని పక్షంలో వ్యవసాయ సంక్షేమ పథకాలు, సబ్సిడీలు వర్తించవని స్పష్టం చేశారు.

కమీషన్ల కోసం వేధించడం తగదు

కొలిమిగుండ్ల: గ్రామాల్లో సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు పెట్టేందుకు ఈఓఆర్డీలు, పంచాయితీ కార్యదర్శులు కమీషన్ల కోసం వేధించడం తగదని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం కొలిమిగుండ్లలో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌లు రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్నికయ్యారన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కమీషన్ల కోసం సర్పంచ్‌లను అధికారులు ఇబ్బందులు పెడుతుండడంతో మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారన్నారు. జిల్లాలో చాలా మండలాల్లో సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు పెట్టేందుకు వెళితే కమీషన్‌లు ఇవ్వాల్సిందే అని అధికారులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. సర్పంచ్‌లను ఇబ్బందులకు గురి చేస్తే జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. గ్రామాల్లో సర్పంచ్‌ల విషయంలో ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. సమస్యలను త్వరలోనే పంచాయితీరాజ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పది ప్రశ్నపత్రాలు



బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో పది ప్రశ్నపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

డోన్ టౌన్: ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. మంగళవారం వాటిని సరి చేసుకుని భద్రపరిచినట్లు చీఫ్ సూపరిటెండెంట్‌లు తెలిపారు. డోన్ పట్టణంలోని నాలుగు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 8 కేంద్రాల్లో 1,600 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. కాగా పరీక్షలకు డిపార్ట్‌మెంటల్ అధికారులుగా సుబ్బారెడ్డి, రాంప్రసాద్, శివుడు, మౌలాలి, విజయలక్ష్మి, రాంమోహన్, రాఘవేంద్రమ్మ, సుభాన్ వ్యవహరించున్నారు. కస్టోడియన్లుగా లక్ష్మీకాంతరెడ్డి, నారాయణలు ఉన్నారు.

బేతంచెర్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షల సెట్–2 ప్రశ్నపత్రాలు మంగళవారం బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. కస్టోడియన్ అధికారి పురుషోత్తం రెడ్డి పర్యవేక్షణలో 6 పరీక్ష కేంద్రాల నిర్వాహణ అధికారులు ప్రశ్నపత్రాలను భద్రపరిచారు. సెట్–1 ప్రశ్నపత్రాలు సోమవారం వచ్చినట్లు తెలిపారు. కాగా మండలంలో మొత్తం 1106 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని.. ఇందులో బాలురు 606, బాలికలు 500 మంది ఉన్నట్లు ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు.

జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపండి

అవుకు: మండలంలోని ఆయా రైతు సేవా కేంద్రాల్లో రైతులు సాగు చేసిన పంట వివరాల జాబితాను ఉంచామని.. అభ్యంతరాలు ఉంటే తెలపాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ అన్నారు. మంగళవారం అవుకు మండలం సుంకేసుల గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ–పంట ముసాయిదా జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో మండలంలోని 4,994 మంది రైతులకు సంబంధించి 14,957 ఎకరాల్లో ఈ–పంటను నమోదు చేసినట్లు తెలిపారు. రైతుల జాబితాను ఆయా రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 20వ తేదీ వరకు ప్రచురించనున్నట్లు తెలిపారు. జాబితాలో రైతు పేరు, విస్తీర్ణం, సాగు చేసిన పంటలో ఏవైనా పొరపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకునిరావాలని సూచించారు.

సంక్షిప్తం

సమాజ సేవతోనే ఆత్మసంతృప్తి

డోన్ టౌన్: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషణంరెడ్డి, శ్రీనివాసులు అన్నారు. దాత మార్నెళ్ల రాజశేఖర్‌రెడ్డి సహకారంతో మంగళవారం అంబేడ్కర్ ఎస్సీ బాలిక పాఠశాలకు రూ.7వేల విలువైన చార్జింగ్ లైట్లు, ట్యూబ్‌లైట్లు, వాటర్ క్యాన్లను అందజేశారు. 70 మంది పదో తరగతి విద్యార్థినులకు ప్యాడ్స్, పెన్నులు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి నివాళి

డోన్: పట్టణంలోని సుందర్‌సింగ్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఉడుములపాడు ఎర్రమల(65) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కురుకుంద హరి, మహేశ్వరరెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

సంజామల: రీసర్వే పనులు ప్రతి రోజు 25 ఎకరాలకు మించకుండా పకడ్బందీగా నిర్వహించాలని నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్నారు. మండల పరిధిలోని హోత్రమాన్‌దిన్నె గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. గడువులోపు రీసర్వే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. డీఐఓఎస్ శ్రీనివాసులు, చెన్నయ్య, తహసీల్దార్ అనీల్ కుమార్ ఉన్నారు.

15న సామాజిక తనిఖీ బహిరంగ సభ

కోవెలకుంట్ల: స్థానిక స్త్రీశక్తిభవన్ ఆవరణలో ఈ నెల 15వ తేదీ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఏపీఓ శ్రీవిద్య తెలిపారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 2023 ఏప్రిల్ నెల నుంచి గత ఏడాది మార్చి నెలాఖరు వరకు ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్, సర్వశిక్షఅభియాన్, పశు సంవర్ధకశాఖ కింద పనులు చేసినట్లు చెప్పారు. ఈ పనులపై అన్ని గ్రామాల్లో ఈ నెల 14వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామసభలు నిర్వహించి ఆ పనులకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేస్తారన్నారు. ఆ నివేదికల ఆధారంగా 15వ తేదీ ఓపెన్‌ఫోరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉచిత కుట్టుమిషన్ శిక్షణ

సంజామల: మండలంలోని మహిళల నుంచి ఉచిత కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ మంగళవారం తెలిపారు. అర్హులైన మహిళలు గ్రామ సచివాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం ప్రభుత్వం ఉచితంగా కుట్టుమిషన్ అందిస్తుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కోవెలకుంట్ల: వైఎస్సార్ జిల్లా నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. జమ్ములమడుగు సమీపంలోని పెన్నా నది నుంచి ఇసుకను ట్రాక్టర్లలో నింపుకుని కోవెలకుంట్లవైపు వస్తుండగా సమాచారం మేరకు దాడి చేశామన్నారు. కేసు నమోదు చేసి రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు జామెట్రి బాక్సుల పంపిణీ

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం జామెట్రి బాక్సులను పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థి రామకృష్ణారెడ్డి 67 మంది పదో తరగతి విద్యార్థులకు రూ. 5,500 విలువ చేసే బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అన్వర్ బాషా మాట్లాడుతూ.. తమ పాఠశాలకు పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. పాఠశాలకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థులకు సైతం విద్యాసంబంధిత పరికరాలు అందజేయడం అభినందనీయం అన్నారు. పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు అంజనప్ప, శంకర్, సుజాత పాల్గొన్నారు.

యువత పోరు పోస్టర్ల ఆవిష్కరణ

బేతంచెర్ల: నంద్యాలలో బుధవారం జరిగే వైఎస్సార్‌సీపీ యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రామ చంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు లక్ష్మిరెడ్డి, నాగిరెడ్డి, గూని నాగరాజు, గుండా జయచంద్రయ్య, శేఖర్ రెడ్డి, దస్తగిరి, ఖాజా, నిరంజన్‌తో కలిసి యువత పోరు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

'యువత పోరు'ను విజయవంతం చేయండి

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నంద్యాలలో నిర్వహించనున్న యువత పోరుకు విద్యార్థులు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పేరం నందకిషోర్‌రెడ్డి కోరారు. పేద విద్యార్థులకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ యువత పోరు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించారన్నారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలపాలన్నారు.



బేతంచెర్లలో యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మవిశ్వాసంతో మంచి ఫలితాలు సాధ్యం



పదో తరగతి విద్యార్థులతో సీఐ రాకేష్

డోన్ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని రూరల్ సీఐ రాకేష్ అన్నారు. మంగళవారం డోన్ మండలం మల్లెంపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సీఐ చేతుల మీదుగా పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు జీవితానికి తొలి మెట్టు లాంటిదని తెలిపారు. అశ్రద్ధ చేయకుండా బాగా చదుకుని పరీక్షలు రాయలన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ముఖ్యంగా టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. పరీక్షల సమయంలో వాటిని చూసుకుంటూ సమయం వృథా చేసుకోకూడదన్నారు. మంచి అలవాట్లను అలవర్చుకుని జీవితంలో ముందుకు వెళ్లాలన్నారు.

దత్తాత్రేయశర్మకు జగ్గర్లపూడి పురస్కారం

డోన్ టౌన్: పట్టణానికి చెందిన రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు, శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ దంపతులు జగ్గర్లపూడి రాజ్యలక్ష్మి పుల్లయ్య స్మారక పురస్కారం అందుకున్నారు. తెలుగు భాష వికాస ఉద్యమ కార్యదర్శి జేఎస్‌ఆర్కే శర్మ తన తల్లిదండ్రుల పేరుతో ఏర్పాటు చేసిన జగ్గర్లపూడి పురస్కారాన్ని ఈ నెల 9వ తేదీ కర్నూలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దత్తాత్రేయశర్మ దంపతులకు అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం డోన్ వేదమాత బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు కళ్లె శేషావలి శర్మ, సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న దత్తాత్రేయశర్మ దంపతులు

అందరి సహకారంతోనే పీహెచ్‌సీ అభివృద్ధి

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కమిటీ సభ్యులు సహకరించాలని మెడికల్ ఆఫీసర్ మోనిక కోరారు. మంగళవారం మండలంలోని పలుకూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన నిర్వహించారు. కమిటీ కన్వీనర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోనిక మాట్లాడుతూ.. వైద్యశాల అభివృద్ధికి 2024–25 బడ్జెట్ విడుదలైందని, ఈ నిధులు సక్రమంగా ఉపయోగపడేలా అభివృద్ధి కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. గ్రామ సర్పంచ్ సుమలత, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అభివృద్ధి కమిటీ కన్వీనర్ మోనిక

గేటు కష్టాలు..!



గేటు ఎత్తడంతో పోటెత్తిన వాహనాలు



రైల్వేగేటు వద్ద నిలిచిపోయిన వాహనాలు

బేతంచెర్ల: పట్టణంలోని బనగానపల్లె రైల్వేగేటు సమస్య స్థానికులు, వాహనదారులను వెంటాడుతోంది. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నోచుకోకపోవడంతో రైళ్లు, గూడ్స్ వెళ్లేటప్పుడు వాహనదారులు చాలా సమయం ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఈ రైల్వే గేటు మీదుగా బనగానపల్లె, ప్రొద్దుటూరు, కోవెలకుంట్ల ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులతో పాటు ఆటోలు, వందలాది ట్రాక్టర్లు, లారీలు వెళ్తుంటాయి. ముఖ్యంగా గనులు డిపోల నుంచి నిత్యం ట్రాక్టర్లు, లారీలు నాపరాయి లోడుతో ఫ్యాక్టరీలకు బేతంచెర్లకు వస్తుంటాయి. బనగానపల్లె మండలం యనకండ్ల వద్ద మహా సిమెంట్ ఫ్యాక్టరీ ఉండడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఒక్కోసారి రైల్వే గేటు పడిందంటే ఇటు వైపు, అటు వైపు వందలాది వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు అంతారయం ఏర్పడుతుంది. గేటు ఎత్తారంటే వాహనచోదకులు వెళ్లేందుకు పోటీ పడుతూ కింద పడిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి బనగానపల్లె రైల్వే గేటుపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వాహనదారులు, పట్టణ వాసులు కోరుతున్నారు.

గంటల కొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితి



బనగానపల్లె మండలం రామకృష్ణాపురం తదితర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, లారీలు నాపరాళ్లను అయ్యలచెరువుకు తరలిస్తుంటారు. రైల్వే గేటు పడినప్పుడు ఆయా ప్రాంతాలకు వెళ్లే బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు గంటల కొద్ది వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పట్టణ ప్రజలు, వాహనదారుల ఇబ్బందులను గుర్తించి రైల్వే గేటు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుంది.

–వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకుడు, బేతంచెర్ల

అత్యవసర సమయంలో ఇబ్బందులే



అత్యవసర సమయంలో గేటు పడిందంటే ఇబ్బందులు తప్పవు. ప్రధానంగా పారిశ్రామిక కేంద్రం కావడంతో అటు వైపు నుంచి నాపరాళ్ల లోడుతో ట్రాక్టర్లు, లారీలు వస్తుంటాయి. ప్రమాదాలు జరిగాయంటే బాధితులను ఈ గేటు మీదుగానే ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో గేటు పడిందంటే వాహనాలు బారులు తీరుతుంటాయి. సమస్య పరిష్కారం కోసం రైల్వే ఉన్నతాధికారులు చొరవ చూపాలి.

–మద్దిలేటి, బేతంచెర్ల